సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 10 । జూలై । 2024



ఖాజీపేటలో దొంగల బీభత్సం

పల్లెల్లో దొంగల ముఠాలు రెచ్చిపోతున్నాయి. రోడ్డు వైపున చిన్న దుకాణాల్లో వరుస దోపిడీలు, దొంగతనాలతో హల్చల్ చేస్తున్నాయి.

-8లో



అనుమానంతోనే.. గొంతుకోసి హత్య

నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె వ్యవసాయ పొలాల్లో జూన్ 27న జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు.

-8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.2/25.4

జిల్లాలో మంగళవారం 25.4 - 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

జెడ్పీలో సమస్యల ఏకరువు

- ఒక్కొక్కటిగా హామీల అమలు చేస్తాం
- జెడ్పీ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: కడప జెడ్పీ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. రైతులు, విద్యార్థుల సమస్యలపై గళమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. అధికారపార్టీ నేతలు, అధికారులు నామమాత్రపు సమాధానాలతోనే సరిపెట్టారు.

బానిసల్లా పని చేస్తాం..

రాష్ట్ర ప్రజల కోసం తాము కట్టు బానిసల్లా పనిచేస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జెడ్పీ ఇన్‌చార్జి చైర్ పర్సన్ శారద అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజల అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులను తీసుకొస్తామని వెల్లడించారు. కక్ష సాధింపులు ఉండవని, అధికారం ఉందని అహంకారం ప్రదర్శించబోమని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వెయిటింగ్ లిస్టు మేరకు రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లు మంజూరు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మారిందని వంట ఏజెన్సీలు, స్వీపర్లను తొలగించబోమని స్పష్టం చేశారు. వలంటీర్ల వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయమే తీసుకుంటుందని తెలిపారు.

- రైతులకు యూరియా, డీఏపీ సరఫరా చేయాలని, రైతు భరోసా సాయం అందించాలని చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు తాము ఇచ్చిన హామీ మేరకు రూ. 20 వేల సాయం చేస్తామని మంత్రి బదులిచ్చారు.
- చీనీ, మామిడి, పంటలకు ప్యాక్‌హౌస్‌లు ఏర్పాటు చేయాలని, ఖర్జూర పంట సాగును ప్రోత్సహించాలని వీఎన్ పల్లె ఎంపీపీ కోరారు. మామిడి రైతులకు పాస్పేట్ సబ్సిడీ కింద సరఫరా చేయాలని చక్రాయపేట జెడ్పీటీసీ కోరారు. జిల్లా ఉద్యాన అధికారి బదులిస్తూ ప్యాక్‌హౌస్‌ల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

బోగస్ సర్టిఫికెట్ల జారీపై కేసులు - 'పుట్టా'

సదరమ్ క్యాంపుల్లో అనర్హులకు కూడా అర్హులుగా వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. బోగస్ సర్టిఫికెట్లు జారీచేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. రహదారి సక్రమంగా లేకపోయినా టోల్ వసూలు చేయడం తగదన్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం రాజోలి ఆనకట్ట నిర్మాణాన్ని తమ ప్రభుత్వం చేపట్టనుందని తెలిపారు. ఆనకట్ట నిర్మాణాన్ని కడప సీఈ పరిధిలోకి తీసుకురావాలని కోరారు.



సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు

తల్లికి వందనం ఇవ్వాలి -ఎమ్మెల్సీ



విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం ఇంత వరకు విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద డబ్బు ఇవ్వలేదని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఇందువల్ల విద్యార్థుల చదువుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. గతంలో తమ ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే జూన్‌లోనే రూ. 15000 విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసేదని పేర్కొన్నారు. ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా నేటికి అమలు చేయలేదన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ,చిత్రంలో కలెక్టర్ శివశంకర్, జేసీలు

మార్గదర్శకాలేవీ? -సీకే దిన్నె జెడ్పీటీసీ



తల్లికి వందనం పథకం గురించి ఆర్భాటంగా హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇంతవరకు మార్గదర్శకాలు ఇవ్వలేదని సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. మధ్యాహ్న భోజన పథకం నాసిరకంగా ఉందని, గుడ్లు, చిక్కీలు ఇవ్వడం లేదన్నారు. ఖాజీపేటలో కలుషిత నీరు తాగడం వల్ల ఆస్పత్రుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2.30 లక్షల మంది వలంటీర్ల పరిస్థితి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజలకు ఇసుక ఉచితంగా ఇస్తున్నామంటూ సీనరేజ్, ఇతర పేర్లతో డబ్బులు వసూలు చేయడంలో ఔచిత్యం ఏమిటని నిలదీశారు.

ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలి – కలెక్టర్

జిల్లా అధికారులు కచ్చితంగా ప్రొటోకాల్ అమలు పాటించాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు లేవనెత్తిన సమస్యలను వచ్చే జెడ్పీ సమావేశానికి పరిష్కారాలు చూపాలన్నారు. అధికారులు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, కడప, అన్నమయ్య జాయింట్ కలెక్టర్లు గణేష్‌కుమార్, ఫర్హాన్ అహ్మద్ ఖాన్, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపికైన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నూతన కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు.

▶▶ ప్రొటోకాల్ అమలు చేయాలి: ఎమ్మెల్యే ఆకేపాటి



ప్రభుత్వ కార్యాలయాలు, కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రొటోకాల్ అమలు చేయాలని రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కోరారు. టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి సుబ్రమణ్యం ఒంటిమిట్ట మండలంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో తమ అనుచరులతో తిష్ట వేసి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఆయన ప్రజాప్రతినిధి కాకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇలాగే వ్యవహరిస్తే శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమవుతుందని హెచ్చరించారు. ఈ దశలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి జోక్యం చేసుకుని గత ప్రభుత్వ హయాంలో ప్రొటోకాల్ పాటించకుండా తనను కించపరిచారని తెలిపారు. దీంతో ఆకేపాటి, ఎమ్మెల్సీ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ తాను ఎన్నడూ అలా వ్యవహరించలేదని తెలిపారు.

- రాజంపేటలో డయాలసిస్ సెంటర్ నిర్మాణం పూర్తయి తమ ప్రభుత్వ హయాంలోనే సేవలు కూడా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన విషయాన్ని తెలుసుకోవాలంటూ ఎమ్మెల్సీ ప్రశ్నకు ఆకేపాటి సమాధానమిచ్చారు. ఇసుక క్వారీలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఇసుక పాలసీ విధి విధానాలు వినియోగదారులకు అర్థం కాని రీతిలోఉన్నాయన్నారు. ఇసుక విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.
- సీజనల్ వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ కోరారు. విరేచనాలు, విష జ్వరాలు ప్రబలుతున్నాయని, వైద్యులు గ్రామాల్లోకి రావడం లేదన్నారు. బి.కోడూరు మండలంలో ప్రభుత్వ ఆస్పత్రికి క్వార్టర్స్ అదనంగా ఏర్పాటుచేస్తే స్టాఫ్ నర్సులు అక్కడే ఉండేందుకు అవకాశం ఉంటుందని జెడ్పీటీసీ దావీదు తెలిపారు. వేంపల్లెలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నప్పటికీ గైనకాలజిస్టు లేరని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు.

▶▶ కోల్డ్ స్టోరేజ్ ప్లాంటు అందుబాటులోకి తేవాలి: ఎంపీ



అరటి రైతుల కోసం తమ ప్రభుత్వ హయాంలో రూ. 23 కోట్లు ఖర్చు చేసి ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మించామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. యూజర్ ఏజెన్సీని ఎప్పుడు గుర్తిస్తారో తెలపాలని ప్రశ్నించారు. నిర్ణీత కాల వ్యవధిలో యూజర్ ఏజెన్సీని గుర్తించి అరటి రైతులకు మేలు చేయాలని కోరారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పథకాల్లో ఎలాంటి జాప్యం లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. చక్రాయపేట మండలంలో తమ ప్రభుత్వ హయాంలో కాలేటి వాగు నిర్మాణ పనులు 75 శాతం పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇందువల్ల 72 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందన్నారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

▶▶ సమస్యలపై గళం

జెడ్పీటీసీలు రవికుమార్‌రెడ్డి, ముత్యాల ప్రసాద్, దావీదు, ఎంపీపీలు వీరనారాయణరెడ్డి, చీర్ల సురేష్‌యాదవ్ తదితరులు మాట్లాడుతూ త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. జెడ్పీ గ్రాంటు ద్వారా జరిగే అభివృద్ధి పనులను జెడ్పీటీసీల ద్వారా నిర్వహించే అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై తీర్మానం ఆమోదించాలన్నారు. పశువుల బీమాతో పాటు షెడ్లు మంజూరు చేయాలన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు భవన వసతి కల్పించాలన్నారు. మినీ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

ప్రొద్దుటూరు: మండలంలో రామాపురం గ్రామ పరిధి పెన్నానది లోనుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నదిలో నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న ఇసుక క్వారీల నుంచే ఇసుకను తీయాల్సి ఉంది. ఇసుక లేదనే కారణంతో అధికారులు ప్రొద్దుటూరుకు ఇసుక క్వారీ మంజూరు చేయలేదు. అయినా అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారు.

లాభాపేక్ష లేకుండా ఇసుక సరఫరా

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వానికి లాభాపేక్ష లేకుండా, కేవలం నిర్వహణా చార్జీలు వసూలుతో వినియోగదారులకు డిపోల ద్వారా ఇసుకను సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం టన్ను ఇసుక ధరను ఒక్కో రీచ్ పరిధిలోని స్టాక్ పాయింట్ కు ఒక్కో ధరను నిర్ణయించిందన్నారు. నిర్ణయించిన టన్ను ధరకు రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుసుమును చలానా ద్వారా చెల్లించేందుకు కలెక్టర్, జిల్లా గనులశాఖ అధికారి పేరిట సంయుక్తంగా తెరిచిన ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా నంబర్ : 43131042192, ఐఎఫ్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0011122 (కలెక్టరేట్ ట్రెజరీ బ్రాంచ్)కు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

పేరుకే ఉచితం.. అంతా బూటకం

- లోడింగ్, రవాణా చార్జీల పేరుతో వినియోగదారులపై భారం
- టీడీపీ నేతల పక్కా వ్యూహంతో దోపిడీ

కడప కోటిరెడ్డిసర్కిల్: అలవిగాని హామీలతో అందలమెక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తాము చెప్పిన అబద్ధాలపై ఇసుక కోటలు కడుతోంది. ఇసుక ఉచితమని ఊదరగొట్టిన ప్రభుత్వం ఇప్పుడేమో వసూళ్లకు తెర లేపేందుకు సిద్ధమవుతోంది. రవాణా, లోడింగ్ చార్జీల పేరుతో వినియోగదారులపై భారం మోపుతోంది. తమకు కప్పం కట్టాల్సిందేనంటూ తెగేసి చెప్పేసింది. సామాన్యుడి నడ్డి విరిచేలా ఇసుక ధరతోపాటు లోడింగ్ చార్జిలు, ట్రావెలింగ్ చార్జీలు అదనమంటూ తేల్చేసింది. మరో వైపు లోడింగ్, రవాణా చార్జీల పేరుతో వ్యవస్థలన్నీ తన గుప్పిట్లో పెట్టుకునేలా టీడీపీ నేతలు స్కెచ్ వేస్తున్నారు. ఇప్పటికే డిపోల్లో ఇసుకను దోచుకున్న టీడీపీ వర్గీయులు ఇక కృత్రిమ కొరతను సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు.

- రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎలాంటి లాభాపేక్ష లేదంటూనే ఇసుక వ్యాపారానికి ప్రణాళిక సిద్ధం చేసింది. రీచ్‌ల నుంచి యార్డులకు తరలించడానికి అయ్యే నిర్వహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తామంటూ టన్ను ఇసుకను భారీ ధరకు విక్రయిస్తున్నట్లుగా ప్రకటించింది. నిన్నటివరకు ఇసుక విధానంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించి తాజాగా కూటమి ప్రభుత్వం చివరికి అదే పాలసీని అమలు చేస్తూ ధరను పెంచేలా భారం మోపుతోంది. మొత్తానికి కూటమి ప్రభుత్వం ప్రజల కళ్లల్లో ఇసుక కొట్టింది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతూ ఇసుక పాలసీని తెచ్చింది. అయితే అప్పటి ప్రతిపక్ష టీడీపీ ఇసుక విక్రయాలపై దుష్ప్రచారం చేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామంటూ గొప్పలు చెప్పింది. అయితే వాస్తవానికి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉచిత ఇసుక పేరుతో రీచ్‌లను దోచుకున్నారు. తాజాగా మరోసారి టీడీపీ ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తామంటూ ప్రగల్భాలు పలికి ధరను నిర్ణయించి మరోసారి ప్రజలను మోసం చేస్తోంది.



కమలాపురం స్టాక్ యార్డులో ఇసుకను లోడింగ్ చేస్తున్న దృశ్యం

జిల్లాలో 11 స్టాక్ యార్డులు .. జిల్లాలో మొత్తం 11 స్టాక్ యార్డులు ఉన్నాయి. ఇసుకను ఆయా నిల్వ కేంద్రాల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందులో టన్ను ప్రకారం కొండాపురం మండలంలోని కె.వెంకటాపురం, పి. అనంతపురం నుంచి రూ.340, కమలాపురం రూ.341, సిద్దవటం మండలంలోని జ్యోతి రూ.340, బద్వేల్ రూ.468, పోరుమామిళ్ల రూ.587, పెండ్లిమర్రి మండలంలో పడగాలపల్లి, కొత్తూరులలో రూ.340, వీఎన్ పల్లె మండలంలోని ఎర్రబల్లి రూ.340, పులివెందుల రూ.468, మైదుకూరు రూ.400 చొప్పున వినియోగదారులు చెల్లించాలన్నారు. దీనికి రవాణా చార్జీలు అదనం.

రీచ్‌లోనే లోడింగ్ చేసుకునే సౌకర్యం కల్పించాలి



సాండ్ స్టాక్ యార్డులో కాకుండా రీచ్‌లోనే సాండ్ లోడింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తే చాలా ప్రయోజనం ఉంటుంది. గత ప్రభుత్వంలో టన్నుకు రూ.475 వసూలు చేసేవారు. ఇపుడు టన్నుకు రూ.341 వసూలు చేస్తున్నారు. అప్పుడు ఉచితం ఎలా అవుతుంది. ప్రభుత్వం స్పందించి రీచ్‌లోనే రూ.250తో లోడింగ్ చేస్తే మేలు చేకూరుతుంది.

-సద్దాం హుసేన్, వినియోగదారుడు,గువ్వల చెరువు, కడప.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలపై సలహాలు, సూచనలను స్వీకరించేందుకు బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. ప్రయాణీకులు తమ సమస్యలను 9959225774 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు జాబ్‌మేళా



కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, అల్ డిక్సన్, ట్రివిజన్, కాంపోజిట్ టెక్నాలజీ కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 18-32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ. 12-35 వేల వరకు హోదానుబట్టి వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోలతో రావాలన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా

నూతన ఆర్‌జేడీ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టిన కాగిత శామ్యూల్

కడప ఎడ్యుకేషన్: అందరి సమిష్టి కృషితో విద్యా అభివృద్ధికి కృషి చేస్తానని పాఠశాల విద్య ఆర్‌జేడీ(ఎఫ్ఏసీ కాగిత శామ్యూల్ పేర్కొన్నారు. మంగళవారం కడపలోని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల వారి కార్యాలయంలో పాఠశాల విద్య ఆర్‌జేడీ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ పరిధిలోని కడప, కర్నూల్, చిత్తూరు, అనంతపురం జిల్లాల వ్యాప్తంగా పాఠశాల విద్య అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాఠశాలల పర్యవేక్షణను పెంచి పాఠశాలల్లో సమస్యలతోపాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



ఆర్‌జేడీకి అభినందనలు తెలుపుతున్న డీఈఓ మర్రెడ్డి అనూరాధ

అభినందనలు తెలిపిన డీఈఓ, డిప్యూటీ ఈఓలు...

పాఠశాల విద్య ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన కాగిత శామ్యూల్‌ను డీఈఓ మర్రెడ్డి అనూరాధ, కడప డిప్యూటీ ఈఓలు రాజగోపాల్‌రెడ్డి, ప్రొద్దుటూరు డిప్యూటీ ఈఓ క్రిష్ణప్ప మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

▶▶ వ్యవసాయ కుటుంబం నుంచి...

గుంటూరు జిల్లా కర్లపాలెం గ్రామానికి చెందిన కాగిత శామ్యూల్‌ది వ్యవసాయ కుటుంబం. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుని 2008లో డిప్యూటీ ఈఓ పోస్టుకు ఎంపికైన మదనపల్లెలో తొలి ఉద్యోగాన్ని చేపట్టారు. ఆ తరువాత 2010లో ఎఫ్ఏసీ డీఈఓగా చిత్తూరు జిల్లాలో పనిచేశారు. అప్పటి నుంచి వివిధ చోట్ల పలు హోదాల్లో పని చేస్తూ 2023లో విజయవాడలోని విద్యాశాఖలో మోడల్ స్కూల్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్‌గా వచ్చారు. ఇక 2024లో కర్నూల్‌జిల్లా డీఈఓగా పని చేస్తున్న శామ్యూల్‌ను ప్రస్తుతం పాఠశాల విద్య ఆర్‌జేడీ(ఎఫ్ఏసీ)గా ప్రభుత్వం నియమించింది.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ,
చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2024

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు

మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు

మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250. మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

భద్రతకు పరీక్ష... లైసెన్స్‌తో రక్ష

డ్రైవింగ్ లైసెన్సే కదా.. తీసుకుందాంలే... ఊర్లో పోలీసులు మన వాహనాన్ని ఆపరు. ఒక వేళ ఆపితే వందో.. రెండు వందలో చెల్లిస్తే సరిపోతుంది. రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లి ఉత్తీర్ణులు కావడం... ఆపై అధికారుల ముందు వాహనాన్ని నడపటం కష్టం...సమయం వచ్చినప్పుడు చూద్దాం... అనుకునే వాహన చోదకులు ఒక విషయం గుర్తుంచుకోవాల్సి ఉంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రమాదాలు జరిగితే ప్రభుత్వ పథకాలు చేతికి అందవు. అందుకే వాహనం నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలి. వాహదారుడి భద్రతకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

- డ్రైవింగ్ లైసెన్స్‌తో ఎన్నో ఉపయోగాలు
- ఇంటి నుంచే ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు అవకాశం
- అనుమతులు లేని రవాణాతో నష్టాలే



ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వాహన దారులకు డ్రైవింగ్ లైసెన్స్, ఎల్ఎల్ఆర్ అనుమతి పత్రాలు మంజూరు చేసే సేవలను ప్రభుత్వం సులభతరం చేసింది. గతంలో ప్రజల ముంగిట రవాణా శాఖ పేరుతో మేళా నిర్వహించేవారు. రవాణా శాఖ అధికారులు ప్రతి కళాశాలకు వెళ్లి ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ ఆవశ్యకత వివరించి అనుమతులిచ్చారు. జిల్లాలో ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం, ప్రొద్దుటూరులో ప్రాంతీయ రవాణా, బద్వేలు, పులివెందుల ఎంవీఐ కార్యాలయాలున్నాయి. ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్న వారు ఎల్ఎల్ఆర్ కోసం ఇంటి నుంచే దరఖాస్తు చేయవచ్చు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉంది. స్లాట్ ప్రకారం పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత అధికారుల ఎదుట వాహనాలు నడిపి అనుమతులు పొందవచ్చు.

అరకొర డ్రైవింగ్‌తో రోడ్డెక్కేస్తున్నారు

ప్రతి కుటుంబానికి సరాసరి రెండు లేదా మూడు వాహనాలు కనిపిస్తున్నాయి. ఇంట్లో పెద్ద, చిన్న తేడా లేకుండా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మానవుల జీవితానికి తక్షణ అవసరంగా మారిన వాహనాలు నడపటానికి ముందు రహదారి నిబంధనలు తెలుసుకోవాలి. ఆ తర్వాత రవాణా శాఖ నుంచి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని రోడ్డు పైకి రావాలి. ఇవేవీ పట్టించుకోకుండా అరకొర డ్రైవింగ్ నేర్చుకొని రోడ్డెక్కుతున్నారు. ఇలాంటి వారితో ఎదుటి వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

కంప్యూటర్‌పై అవగాహన లేక..

డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అవసరమైన సూచిక పరీక్షలో కంప్యూటర్ వినియోగించడం మినహా మరో మార్గం లేదు. ఉత్తీర్ణత సాధించాలంటే మాక్ టెస్ట్ ద్వారా ముందస్తుగా సాధన చేయడం తప్పనిసరిగా మారింది. కడప డీటీసీ కార్యాలయంలో రోజుకు 80, నెలకు రూ.2400 చొప్పున ఏడాదికి దాదాపు 30 వేల మంది వరకు డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో 95 శాతం అక్షరాస్యత కలిగి ఉన్నప్పటికీ కంప్యూటర్ వినియోగించడంలో కనీస నైపుణ్యంలేనివారికి ఇబ్బందులు తప్పడంలేదు. కంప్యూటర్‌పై అవగాహన ఉన్నవారే సూచిక పరీక్షలో బోల్తా పడుతుండగా ఏ మాత్రం తెలియని వారి పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. దీంతో లైసెన్స్ తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే నష్టాలివీ...

- రక్షణాత్మక డ్రైవింగ్ తెలియక తమతోపాటు ఎదుటి వాహనాదారులను మృత్యుకోరల్లోకి తీసుకెళ్తారు.
- మృతులకు ప్రభుత్వం అందించే ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు అందదు.
- ప్రమాదంలో మరణించిన వారికి ఇచ్చే రెట్టింపు ఇన్సూరెన్స్ రాదు. క్షతగ్రాతులకు మెరుగైన వైద్య సేవలందవు.
- ప్రాణాలతో బయటపడితే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు.
- రహదారుల నిబంధలపై పూర్తి స్థాయి అవగాహన ఉండదు.
- మలుపుల్లో వేగ నియంత్రిక(స్పీడ్ బ్రేకర్లు) వద్ద రక్షణాత్మక డ్రైవింగ్ చేయలేరు.

ఇవి తెలుసుకోవడం అవసరం

- గేర్లు లేని 50 సీసీ లోపు ఇంజిన్ ఉన్న ద్విచక్ర వాహనాన్ని నడిపేందుకు 16 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. తల్లిదండ్రుల, సంరక్షకుల అనుమతిపత్రం తప్పనిసరి.
- గేర్లు లేకున్నా ఉన్న 50 సీసీకి మించిన ద్విచక్ర వాహనం నడపాలంటే 18 సంవత్సరాల వయస్సు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.
- కారు జీపు నడపటానికి 19 సంవత్సరాలు ఉండి లైసెన్స్ తీసుకోవాలి. లారీ, బస్సు, ట్యాక్సీలు నడపటానికి 20 ఏళ్ల వయస్సు నిండి హెవీ వెహికల్ లైసెన్స్‌తోపాటు ఏడాది అనుభవం ఉండాలి.

నిర్లక్ష్యం వద్దు..



సొంత వాహనాల్లో వెళ్లాలనుకునే వారు డ్రైవింగ్ నేర్చుకున్నప్పటికీ లైసెన్స్ తీసుకునే విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపటం నేరం. ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి. డ్రైవింగ్‌లో పూర్తి స్థాయి శిక్షణ తీసుకోవాలి. తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని స్లాట్ ప్రకారం ఎల్ఎల్ఆర్ పరీక్షలో ఉత్తీర్ణులై వాహనాలు నడిపి అనుమతి లైసెన్స్ పొందవచ్చు.
– ఈ. మీరా ప్రసాద్, ఉప రవాణా శాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా

క్లుప్తంగా

పోయిన బంగారు నగల అప్పగింత


బాధితులకు బంగారు నగలను అందజేస్తున్న ఎస్ఐ

నందలూరు : ఓ వ్యక్తి పోగొట్టుకున్న బంగారు నగలను తిరిగి అప్పగించిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ వివరాల మేరకు.. ఆకేపాడు రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆవుల కిషోర్‌రెడ్డి, ఆవుల కవిత సోమవారం రాత్రి సిద్ధవటం నుంచి తమ స్వగ్రామానికి వెళ్తూ నందలూరు కృష్ణ స్వీట్స్ బేకరీ వద్ద ఆగారు. స్వీట్లు కొనుక్కొని తిరిగి ఆకేపాడుకు వెళ్లి చూసుకోగా వారి బంగారు నగల సంచి పోయిందని గుర్తించారు. బాధితులు వెంటనే బేకరీ వద్దకు వెళ్లి వెతకినా సంచి కనపడకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి బంగారు నగల బ్యాగు పోయిందని, అందులో నాలుగు గాజులు, లాంగ్ చైన్ మొత్తం 13 తులాల బంగారం ఉందని ఫిర్యాదు చేయడంతో సీసీ టీవీలో పోలీసులు పరిశీలించారు. కారులోనుంచి మహిళ దిగేటప్పుడు బ్యాగు పడిపోగా అక్కడ ఉన్న ఓ వ్యక్తి బ్యాగు తీసుకోవడం జరిగిందని గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తిని పిలిపించి సంచిని బాధితులకు అందజేశారు.

మైనర్ బాలుడిపై దాడి


గాయపడిన మైనర్ బాలుడు జాసర్

నందలూరు : మండలంలోని అరవపల్లికి చెందిన మైనర్ బాలుడు జాసర్‌పై వ్యక్తిగత కారణాలతో సోమవారం రాత్రి గ్రౌండ్ వద్ద నివాసముంటున్న కొందరు కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడిని చికిత్స నిమిత్తం రాజంపేట ఆసుపత్రిలో చేర్పించారు. దాడి సంఘటనపై స్థానిక పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు.

పాలిసెట్ చివరి దశ నోటిఫికేషన్ విడుదల

మైదుకూరు: పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు చివరి దశ నోటిఫికేషన్ విడుదలైందని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించేందుకు జూలై 11 నుంచి 13వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అనంతరం సర్టిఫికెట్ వెరిఫికేషన్, కళాశాల ఆప్షన్ల నమోదు ఉంటుందని.. జూలై 16న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. జూలై 18 నుంచి 20వ తేదీ వరకు కేటాయించిన కళాశాలలో చేరాల్సి ఉంటుందని వివరించారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, మూడేళ్ల డిప్లొమో కోర్సు పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. డిప్లొమో తర్వాత బీటెక్ చేయుటకు ఈసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ కూడా ఇస్తామన్నారు.

ఉరివేసుకొని ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని కొండసుంకేసుల గ్రామంలోని గజ్జల సురేష్(35) మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొండసుంకేసుల గ్రామానికి చెందిన జి.సురేష్‌కు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బేల్దారి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఏడాది కిందట కుటుంబ సమస్యలతో పిల్లలు, భర్తను వదిలేసి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసైన సురేష్ అప్పులు చేశాడు. కట్టలేక తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

వ్యక్తిపై దాడి

– నలుగురిపై కేసు

కడప అర్బన్ : కడప నగర రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆరోగ్యమాల చర్చి సమీపంలో బయనపల్లి సుబ్బరామయ్యపై ఈ నెల 8న రాత్రి దస్తగిరమ్మ, మరో ముగ్గురు దాడి చేశారు. డబ్బుల బాకీ వ్యవహారంలో ఘర్షణ ఈ దాడికి దారి తీసింది. గాయపడిన సుబ్బరామయ్య కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.

నేటి నుంచి సౌత్‌జోన్ హాకీ క్రీడలు


విలేకరులతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ స్పోర్ట్స్ సింథటిక్ క్రీడా మైదానంలో బుధవారం నుంచి సౌత్‌జోన్ హాకీ క్రీడలు ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ హాకీ సీఈఓ నిరంజన్ రెడ్డి, కార్యదర్శి హర్షవర్ధన్, థామస్ పీటర్, శేఖర్ తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో వారు మాట్లాడుతూ హాకీ పోటీలకు కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి 12 జట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సహకారంతో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

దుకాణంలో దౌర్జన్యం

కడప అర్బన్ : కడప నగరంలోని చెన్నూరు బస్టాండ్ సమీపంలో వున్న ఓ దుకాణంపై ఈ నెల 7వ తేదీన దాడి చేసి పెండ్లిమర్రి మండలం చీమలపెంటకు చెందిన చంద్రశేఖర్, మరికొంతమంది ప్రింటర్ తీసుకెళ్లారు. ఈ సంఘటనలో బాధితుడు ప్రవీణ్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తునట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.

జూదరుల అరెస్టు

కొండాపురం : మండలంలోని పొట్టిపాడు గ్రామంలో పేకాడుతుండగా ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని పొట్టిపాడులో పేకాడుతున్నారనే సమాచారంతో దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.23,910 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఖాజీపేటలో దొంగల బీభత్సం

పల్లెల్లో దొంగల ముఠాలు రెచ్చిపోతున్నాయి. రోడ్డు వైపున చిన్న దుకాణాల్లో వరుస దోపిడీలు, దొంగతనాలతో హల్చల్ చేస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఆలయాల్లో చోరీలు మొదలెట్టిన ముఠాలు ఇపుడు మధ్య తరగతి వాసుల దుకాణాల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఖాజీపేటలో పోలీస్ స్టేషన్‌కు కిలోమీటరు దూరంలోనే దొంగలు చోరీ చేయడం ఇందుకు అద్దంపడుతోంది.

- ఒకే రోజున ఆరు చోట్ల చోరీ
- నిర్లక్ష్యంతో కనిపించని బీట్‌లు
- పనిచేయని సీసీ కెమెరాలు



దుకాణంలో పై భాగంలో రేకులను కట్ చేసిన దృశ్యం, ఖాజీపేట టౌన్‌లో నిరుపయోగంగా సీసీ కెమెరాలు

ఖాజీపేట : ఖాజీపేట టౌన్‌లో ఒకే రోజున సోమవారం రాత్రి ఆరు దుకాణాల్లో చోరీ చేయడం సంచలనం కలిగించింది. రేకుల షెడ్లలోని దుకాణాలే లక్ష్యంగా దొంగలు చోరీకి పాల్పడ్డారు.. పోలీస్ స్టేషన్ పరిధి నుంచి కిలోమీటరు పరిధిలోనే జరిగాయి. ముందుగా బ్రిడ్జి వద్ద రాఘవ ప్లే వుడ్స్ దుకాణం పైభాగంలో ఇనుప రేకులు కట్ చేసి దుకాణంలోకి దూకారు. క్యాష్ కౌంటర్‌లో నగదు అపహరించారు. ఆపై పల్లా టెక్స్‌టైల్స్ పైభాగంలో రేకులు కట్‌చేసి దుకాణంలో క్యాష్ బాక్స్ ఎత్తుకెళ్లారు. మరో దుకాణం వాకిలికి లాక్ పగలగొట్టి చిల్లర తీసుకుని ఉడాయించారు. పక్కనే ఉన్న మరో షాప్ రేకులు కట్ చేసి ఏవీ దొరకకపోవడంతో ప్రక్కనే దామోదర్ జనరల్ స్టోర్ రేకులు కట్‌చేసి అందులో దూకారు. క్యాష్ కౌంటర్‌లో చిల్లర చోరీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు ఆనుకుని ఉన్న వీధిలోని అన్నపూర్ణ ట్రేడర్స్ దుకాణం వాకిలి తాళాలు పగలకొట్టారు.. క్యాష్ కౌంటర్‌లో 50 వేల నగదును అపహరించారు. గౌతమ్ స్కూల్ సమీపంలో మేడపై ఉన్న ఇంటి వాకిలి పగుల కొట్టి ఇంట్లో రూ.10 వేలు రూ.5వేల బిల్లులు, చిల్లర కాయిన్స్ అపహరించారు.

పనిచేయని సీసీ కెమెరాలు

ఖాజీపేట టౌన్‌లో ప్రజావసరాల నిమిత్తం గతంలో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి పనిచేయక పోవడంతో స్థానికుల సహకారంతో కొత్త సీసీ కెమేరాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేశారు. అయితే వాటిని ఇంకా బిగించలేదు.. అప్పటి నుంచి బస్టాండు కూడలిలో కెమెరాలు పనిచేయడం లేదు. స్టేషన్ వరకూ ఉన్న ఫైబర్ వైర్ తెగిపోయింది. వచ్చిన అధికారులు పట్టించుకోక పోవడంతో నిఘా కొరవడింది. తాజాగా దొంగల కదలికల కోసం దుకాణాల వద్ద సీసీ కెమెరాల కోసం పోలీసులు తిరుగుతున్నారు. ఆ కెమెరాల్లో రికార్డులను పరిశీలించి దొంగలను గుర్తించే పనిలో ఉన్నారు. ఇటీవల పోలీసులు ఒక బీట్ వేయడం, వారు సక్రమంగా విధులు నిర్వహించకపోవడం కారణమని స్థానికులు చెబుతున్నారు.

చోరీ విషయం పరిశీలిస్తున్నాం

ఖాజీపేట దుకాణాల్లో చోరీకి యత్నించినట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే పోలీసులను పంపి కారణాలను పరిశీలిస్తున్నాం. రాత్రి వేళల్లో గస్తీ పెంచుతున్నాం. ఫిర్యాదు దారుల వివరాల ఆధారంగా కేసు నమోదు చేస్తాం.
– రామాంజులు, ఖాజీపేట సీఐ

ప్రభుత్వ భూమి ఆక్రమణ


తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జమ్మలమడుగు రూరల్ : పెద్దముడియం మండలంలోని చిన్నముడియం గ్రామంలోని సర్వే నెంబర్ 244–2లోని 7.66ఎకరాల భూమిని టీడీపీ నాయకులు ఆక్రమించినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు క్రిష్టారెడ్డి తెలిపారు.1985లో రాజోలి మునక ప్రాంతంలో చిన్నముడియం గ్రామం ఉండడంతో అక్కడి నుంచి మరో గ్రామం వారికి పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం 7.66 ఎకరాల భూమి కేటాయించింది. ఇప్పటి వరకు పక్కా గృహాల నిర్మాణం జరగకపోవడంతో ఆ భూమి నిరుపయోగంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక టీడీపీ నాయకులు కొందరు ఆ భూమిలో దుక్కులు చేసి ఆక్రమించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై గ్రామస్థులతో కలిసి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ రవికుమార్‌కు మంగళవారం ఆయన ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పదేళ్లయినా న్యాయం జరగలేదు


ఫిర్యాదురాలు రామసుబ్బమ్మ

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రముక్కపల్లిలో నివాసముంటున్న రామసుబ్బమ్మ 2014 ఆగస్టులో కాలినడకన వెళ్తుండగా, మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఇంత వరకు పనిచేసిన ఎస్పీలందరి వద్ద తన ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఇప్పటివరకూ తనకు న్యాయం జరగలేదనని, ఈ నెల 8వ తేదీన 'పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్'లో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు మళ్లీ ఫిర్యాదు చేశానని తెలిపారు.

అనుమానంతోనే.. గొంతుకోసి హత్య

- వీడిన నిమ్మనపల్లె మహిళ హత్య కేసు మిస్టరీ
- భార్యను కిరాతకంగా చంపిన భర్త అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసాదరెడ్డి


భారతి(ఫైల్)


గణపతి (ఫైల్)


గణపతి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్‌రెడ్డి, తదితరులు

మదనపల్లె : మగవారితో చనువుగా మాట్లాడుతోందని.. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భార్య గొంతుకోసి హత్య చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె వ్యవసాయ పొలాల్లో జూన్ 27న జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మదనపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలను డీఎస్పీ ప్రసాదరెడ్డి మంగళవారం వెల్లడించారు.

చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణం నాగరాళ్లవీధికి చెందిన పి.మునిరత్నం కుమారుడు పి.గణపతి(37) అలియాస్ వెంకటేష్‌కు అదే జిల్లా పెనుమూరు మండలం కార్తికేయపురానికి చెందిన వెంకటయ్య, సాలమ్మల కుమార్తె భారతి(26)ని ఇచ్చి తొమ్మిదేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారుల సంతానం. గణపతి ఇటీవల మద్యం తాగుతూ జులాయిగా మారాడు. అతడి భార్య భారతి పలమనేరు బస్టాండులో పూల మ్ముతూ జీవనం సాగిస్తోంది. అయితే పూలు అమ్మేటప్పుడు మగవారితో చనువుగా మాట్లాడుతుండడంతో గణపతి ఆమెపై అనుమానం పెంచుకుని వేధించాడు. విసిగి వేసారిన భారతి ఏడాదిన్నర కిందట పిల్లలను భర్త వద్దే వదలి నెల్లూరు జిల్లా కోవూరులో ఉంటున్న తల్లి సాలమ్మ వద్దకు వెళ్లింది. భర్త పిలిచినప్పుడల్లా పలమనేరుకు వచ్చి పిల్లలను చూసి వెళ్తుండేది.

వివాహేతర సంబంధమందనే అనుమానంతో..

ఇటీవల కొవ్వూరులో భారతి స్థానికుడు రవితో సన్నిహితంగా ఉందని గణపతికి తెలియడంతో అనుమానం పెంచుకున్నాడు. ఆమెను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. పిల్లలను నీ వద్దకు పంపుతా.. తీసుకెళ్లాలంటూ చెప్పి జూన్ 27న భార్యను రప్పించాడు. నెల్లూరు నుంచి రైలులో వచ్చిన భారతి చౌడేపల్లెకు వచ్చి భర్తను కలుసుకుంది. మదనపల్లెలో తెలిసిన వారి వద్ద పిల్లలున్నారని చెప్పి ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె సమీపంలోని వ్యవసాయ పొలంలో పశువుల పాక వద్దకు తీసుకెళ్లారు. వివాహేతర సంబంధంపై నిలదీయడంతో భార్యా, భర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన గణపతి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోసి చంపేశాడు. ఆ సమయానికి పొలానికి నీళ్లు పెట్టేందుకు వచ్చిన రామాంజనేయులుపైనా కత్తితో దాడి చేశాడు. అతడు కేకలు వేయడంతో గణపతి ద్విచక్ర వాహనంలో పారిపోయాడు. మృతురాలి తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్ రెడ్డి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, నిందితుడైన గణపతిని బైపాస్‌రోడ్డులోని నిమ్మనపల్లె సర్కిల్ వద్ద అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి, పీసీలు రాజేష్, శివ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జుడా అసోసియేషన్ కమిటీ ఏర్పాటు


ప్రిన్సిపల్‌కు వినతిపత్రం ఇస్తున్న జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ నాయకులు

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జీఎంసీకే–జూడా) నూతన కమిటీని మంగళవారం ఏర్పాటుచేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ వై.విజయ భాస్కర్‌రెడ్డిలు ఎన్నికైన వారిని అభినందించారు. కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.ఖదీర్‌అహ్మద్, ఉపాధ్యాక్షులుగా డాక్టర్ అశ్విని, డాక్టర్ అల్లూరి నిఖిల్ సింగ్, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ విష్ణుప్రసాద్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన వారంతా సమస్యలను విన్నవించగా వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించి సభ్యులకు తెలియజేస్తామని ప్రిన్సిపల్ సురేఖ్ హామీ ఇచ్చారు.

హుండీ ఆదాయం రూ. 4,30,781

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయ హుండీని ఒంటిమిట్ట ఆలయ సూపరిటెండెంట్ హనుమంతయ్య ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. రూ. 4,30,781లు ఆదాయం వచ్చినట్లు టీటీడీ విజిలెన్స్ అధికారులు దొరస్వామి నాయుడు, గంగులయ్య, దిలీప్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన భాస్కర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే స్టేషన్ సమీపంలోని యార్డు వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి భాస్కర్ అనే వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సుభాన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కడప నగరం ఎర్రముక్కపల్లె గాంధీ నగర్‌కు చెందిన భాస్కర్ ఆటో డ్రైవర్‌గా పనిచేసే వాడన్నారు. కుమార్తె వివాహానికి చేసిన అప్పు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

వసతి గదిలో ఎలక్ట్రిక్ వస్తువులు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రికల్ వస్తువులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలం నేపథ్యంలో విద్యార్థుల హాస్టల్ గదులను మంగళవారం తనిఖీ చేసినట్లు ఏవో రవికుమార్ తెలిపారు. సెక్యూరిటీ, కేర్ టేకర్స్, ఏవోతో సహా సెక్యూరిటీ ఆఫీసర్ పది మంది ఫ్యాకల్టీతో కలిసి విద్యార్థుల హాస్టల్ గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమతి లేకుండా ఉంచిన రైస్ కుక్కర్, హీటర్లు, ఐరన్ బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. తొలి తప్పుగా భావించి విద్యార్థులను మందలించారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. ప్రతి హాస్టల్ బిల్డింగ్ వద్ద సెక్యూరిటీ గార్డు తనిఖీలు నిర్వహించేలా కేర్ టేకర్లు సూచించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని విద్యార్థులకు సూచించారు.